క్లుప్తంగా

షిర్డీలో జెడ్పీ చైర్మన్ పూజలు



నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు కుటుంబ సమేతంగా మంగళవారం మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శనిశిగ్నాపూర్‌లో ఉన్న శనిదేవున్ని కుటుంబ సమేతంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. దేశంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ఇంటర్ టాపర్లకు సన్మానం



సిరికొండ: మండలంలోని సత్యశోధక్ పాఠశాల పూర్వ విద్యార్థులు పలువురు ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి టాపర్లుగా నిలిచారు. పాఠశాలలో పదో తరగతి వరకు చదివిన బి శ్రీనిధి, యస్ స్నేహితరెడ్డిలు ఇటీవల ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 470కి 468 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి టాపర్లుగా నిలిచారు. ఈసందర్భంగా సదరు విద్యార్థులను మంగళవారం పిన్సిపాల్ నర్సయ్య ఘనంగా సన్మానించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు నరేష్, సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు గంగారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

దుస్తులను సకాలంలో అందించాలి

బాల్కొండ: విద్యార్థులకు దుస్తులను సకాలంలో అందించాలని ఏపీడీ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో, కిసాన్‌నగర్‌లో మహిళ సమాఖ్యల ఆధ్వర్యంలో యూనిఫాంలు కుడుతున్న కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభం లోగా దుస్తులను అందించాలన్నారు. ఆయన వెంట డీపీఎం సాయిలు, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఏపీఎం గంగాధర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు చౌడేశ్వరి దేవి ఆలయ ఉత్సవాలు

రుద్రూర్: మండల కేంద్రంలోని చౌడేశ్వరి దేవి ఆలయ ఉత్సవాలు బుధ, గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది వైశాఖ మాసంలో నెల రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ రెండు రోజులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, శోభాయాత్ర ఉంటాయని పేర్కొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌ల తనిఖీ

బోధన్‌టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లి, గోషాల, బస్వతారక్ నగర్, రాకాసీపేట్, సరస్వతినగర్ కాలనీల్లో ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లను, ల్యాబ్‌లను వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది మంగళవారం తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారనే నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సెంటర్లలో ప్రజలకు అందిస్తున్న సేవలు, రక్త పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నివేదికను తయారు జిల్లా వైద్యాధికారికి అందిస్తామని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ విద్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



వేల్పూర్: మండలం లక్కోర వద్ద 63 నంబరు జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సిరిసిల్ల జిల్లా మానాలకు చెందిన గంగనర్సయ్య, గంభీర్‌పూర్‌కు చెందిన రమేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆర్మూర్‌లోని బంధువుల ఇంటికి వచ్చారు. రాత్రి సమయంలో తిరిగి మానాలకు వెళ్తుండగా లక్కోర వద్ద వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న రమేశ్‌తోపాటు వెనుక కూర్చున్న గంగనర్సయ్యకు తీవ్రగాయాలుకాగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆర్మూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్బన్‌లో కాంగ్రెస్‌కే ఆధిక్యం

- 96వేలకు పైగా ఓట్లు సాధించిన పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి
- రెండోస్థానంలో బీజేపీ



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ఎంపీ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఎంపీ అర్వింద్ మంగళవారం విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై లక్షకు పైగా మెజార్టీ సాధించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు(బోధన్, బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, రూరల్, జగిత్యాల కోరుట్ల ఉన్నాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆధిక్యం కనబర్చారు. మొదటి మూడు రౌండ్లలో బీజేపీ ఆధిక్యం కనబర్చగా, 4వ రౌండ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆధిక్యం ప్రదర్శించారు. చివరి 15వ రౌండ్ ముగిసే సరికి జీవన్‌రెడ్డికి 96వేలకు పైగా ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి అర్వింద్‌కు 80వేలకు పైగా ఓట్లు వచ్చాయి. ఈక్రమంలో నిజామాబాద్ అర్బన్‌లో రౌండ్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలను అధికారులు వెల్లడించారు. ఓట్ల వివరాలు ఇవి.

రౌండ్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్
1	6506	4776	628
2	12620	9507	1147
3	19266	14437	1704
4	20025	27679	1928
5	23661	37146	2194
6	33831	40578	3145
7	41431	44669	3958
8	50583	47640	4575
9	59516	50747	5158
10	67317	55042	5915
11	77659	57116	6636
12	79301	66484	6795
13	80458	78019	6944
14	80636	90678	7040
15	80831	96640	7124

మరమ్మతులు చేయరూ!

- గంగాస్థాన్ ఓపెన్ జిమ్‌లో పని చేయని పరికరాలు
- ఇబ్బందుల్లో నగరవాసులు
- పట్టించుకోని అధికారులు



ఓపెన్ జిమ్‌లో ధ్వంసమైన మ్యాట్‌లు



దెబ్బతిన్న ఆట వస్తువులు

నిజామాబాద్‌నాగారం : నగరంలోని గంగాస్థాన్ ఫేజ్–1 ప్రాంతంలోగల విద్యుత్ డీ–5 సెక్షన్ కార్యాలయం పక్కన ఉన్న ఓపెన్ జిమ్ పరిస్థితి అధ్వానంగా తయారైంది. జిమ్ పరిసరాలు అధ్వానంగా మారడంతో పాటు, పరికరాలు సైతం పాడవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

రూ.లక్షలు ఖర్చు చేసినా..

నగరంలోని గంగాస్థాన్ ఫేజ్–1లో ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లో రూ. లక్షలు ఖర్చు చేసి, వ్యాయమం కోసం జిమ్ పరికరాలు, పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. దీంతో పిల్లలు ఉదయం, సాయంత్రం వేళ్లలో ఆడుకోవడానికి వచ్చేవారు. పెద్దలు తమ పిల్లలతో పాటు వచ్చి వాకింగ్ చేయడమే కాకుండా వ్యాయమం సైతం చేసేవారు. కానీ గత కొన్ని నెలలుగా ఓపెన్ జిమ్ పరిస్థితి ఆధ్వానంగా మారుతుంది. ఇందులో ఉన్న సామగ్రి, పరికరాలు అన్ని పాడైపోయాయి. పిల్లలతో పాటు తల్లిదండ్రులు, వృద్ధులు సేదతీరడానికి ఇక్కడికి వస్తున్నారు. కానీ పరికరాలు పాడు కావడం తోపాటు పరిసరాలు అధ్వానంగా ఉండటంతో ఆహ్లాదాన్ని పొందలేకపోతున్నామని వారు పేర్కొంటున్నారు. ఓపెన్‌జిమ్‌లో పిల్లలకు సంబంధించిన ఆటవస్తువులు పాడైపోయాయి. ఓపెన్‌జిమ్‌లో మ్యాట్‌లు సైతం ధ్వంసమయ్యాయి. ఈ విషయం తెలిసిన సంబంధిత అధికారులు కనీస పర్యవేక్షణ చేయడం లేదు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయాల్సి ఉన్నా, ఎవరికి వారు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాడయిన పరికరాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఒర్రెపై కల్వర్టు నిర్మించండి

- గతేడాది వరద ఉధృతికి కూలిన వైనం
- ఇబ్బందులు పడుతున్న గంగారాంనాయక్ తండావాసులు
- పట్టించుకోని అధికారులు



ఒర్రెపై కర్రలతో తండావాసులు ఏర్పాటు చేసుకున్న వంతెన

సిరికొండ: మండలంలోని పాకాల గ్రామ పంచాయతీ పరిధిలోని గంగారంనాయక్ తండా వాసులకు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. తండాకు వెళ్లే మార్గంలో ఒర్రెపై చాలా ఏళ్ల క్రితం చిన్నపాటి వంతెనను నిర్మించారు. శిథిలావస్థకు చేరిన వంతెన గత ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు, వరద ఉధృతికి కూలిపోయింది. దీంతో తండావాసులకు కష్టాలు మొదలయ్యాయి. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. కూలిన కల్వర్టును ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి చూసి వెళ్లారే తప్పా, కొత్త కల్వర్టు నిర్మించలేదు.

తాత్కాలికంగా కర్రలతో వంతెన..

తండాకు రాకపోకలు సాగించడానికి వీలుగా తండావాసులు కర్రలతో తాత్కాలికంగా వంతెన ఏర్పాటు చేసుకున్నారు. ఏడాది కావస్తుండటంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న కర్రలు చెదలు పట్టి విరిగిపోతున్నాయని తండావాసులు పేర్కొంటున్నారు. తండాలో ముప్పై కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయి. పాకాల గ్రామం నుంచి తండా రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రానున్న వర్షాకాలంలో వర్షాలకు వాగు పొంగితే మా తండాకు రాకపోకలు నిలిచిపోతాయని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారీ వర్షాలు కురవకముందే ఒర్రెపై కొత్త వంతెనను నిర్మించాలని తండావాసులు కోరుతున్నారు.

వంతెనను నిర్మించాలి..



పాకాల గ్రామం నుంచి మా తండాకు వెళ్లే దారిలో వంతెన కూలిపోయి ఏడాది కావస్తోంది. తండాకు వెళ్లడానికి తాత్కాలికంగా కర్రలు వేసుకొని వెళుతున్నాం. కొత్త వంతెనను నిర్మించకపోతే వర్షాకాలంలో మా తండాకు రాకపోకలు నిలిచిపోతాయి. ఆస్పత్రికి వెళదామన్న వెళ్లలేని దుస్థితి నెలకొంటుంది. ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి మా తండాకు వెళ్లే దారిలో ఒర్రెపై కొత్త వంతెనను త్వరగా నిర్మించాలి.

– రమేష్, తండావాసి

అ‘పూర్వ’ సమ్మేళనం



కమ్మర్‌పల్లి: మండలంలోని హాసకొత్తూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులందరూ ఒకే చోట కలవడంతో నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. సమ్మేళనంలో గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న అమ్మవారి ఆలయ నిర్మాణానికి ముప్కాల్ జెడ్పీటీసీ బద్దం నర్సవ్వనర్సారెడ్డి దంపతులు రూ. 5 వేల116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారిని అభినందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విజయ్, కంచు గంగాధర్, భూమన్న, చిన్న రాజన్న పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం



రెంజర్లలో కురుస్తున్న వర్షం



పంట భూముల్లో నిలిచిన వర్షపు నీరు



ఆర్మూర్‌లో రోడ్లపై నిలిచిన వర్షపునీరు

ఆర్మూర్‌టౌన్/ బాల్కొండ: ఆర్మూర్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పలు వీధులు వర్షపు నీటితో జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలి దుమారంతో పలు వార్డుల్లో ఇంటిపై కప్పుల రేకులు నేలకొరిగాయి. వీధి వ్యాపారుల వస్తువులు, ఫ్లెక్సీలు రోడ్డున పడ్డాయి. అంతర్గత రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముప్కాల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జల మయమయ్యాయి. విత్తన సాగుకు అనువైన వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ శ్రేణుల సంబురాలు



బోర్గాం(పి)లో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు



సిరికొండ మండల కేంద్రంలో..

సిరికొండ/నిజామాబాద్ రూరల్/సుభాష్‌నగర్/డిచ్‌పల్లి: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో మంగళవారం బీజేపీ శ్రేణులు సంబురాలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో దేశంలో బీజేపీ, నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అర్వింద్ ఘన విజయం సాధించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అన్ని మండలాలు, గ్రామాల్లో పార్టీ నేతలు టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకుంటూ సంబురాలు చేసుకున్నారు. డీజేలు పెట్టి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. జై శ్రీరామ్, జై బీజేపీ అంటూ నినాదాలు చేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని, నృత్యాలు చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ అధికారం చేపట్టబోతుందన్నారు. వచ్చే ఐదు సంవత్సరాలలో దేశం ఎంతో అభివృద్ధి చెంది, డిజిటల్ దిశగా నరేంద్ర మోదీ పాలన కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీగా విజయం సాధించిన అర్వింద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నేతలు రాజేశ్వర్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్, గోపి, శ్రావణ్‌రెడ్డి విష్ణు, మారుతి, అజయ్, విజేందర్‌రెడ్డి, భానుచందర్, రాకేష్, మురళి, నగేష్, నవీన్, మనోహర్, శంకర్‌రెడ్డి, జగన్‌రెడ్డి తదితరులున్నారు.

ఎంపీ అర్వింద్‌కు ఎమ్మెల్యే ధన్‌పాల్ శుభాకాంక్షలు



సుభాష్‌నగర్: నిజామాబాద్ ఎంపీగా ఘన విజయం సాధించిన అర్వింద్ ధర్మపురికి మంగళవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. అర్వింద్ భవిష్యత్‌లో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్పొరేటర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.



కొండూర్ గ్రామంలో..



గుండారం గ్రామంలో..

అర్వింద్ విజయంతో మరిన్ని నిధులు



ఆర్మూర్: ఎంపీగా గెలుపొందిన ధర్మపురి అర్వింద్‌తో కేంద్రం నుంచి మరిన్ని నిధులు రాబట్టుకొని ఈ ప్రాంతం అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఏర్పడిందని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి కుమార్తె, ఆర్ ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచరితరెడ్డి అన్నారు. నిజామాబాద్ ఎంపీగా రెండోసారి విజయం సాధించిన అర్వింద్ నివాసానికి ఆమె మంగళవారం వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవినీతి మచ్చలేని అర్వింద్ గెలవడం సంతోషకరమని అన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,000	వెండి (కిలో)	92,500
22 క్యారెట్స్	67,340	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	30	50	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	70	90
బీరకాయ	40	70	దోసకాయ	25	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	25	40
బీర్నిసుకాయ	100	120	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	25	50	బీట్‌రూట్	20	40
పాలకూర	30	50	కరివేపాకు	50	80
మెంతికూర	50	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	100	130	గోరుచిక్కుడు	50	80
పుదీనా	80	100	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

చందాలు వేసి అంత్యక్రియలు

మాక్లూర్: మండలంలోని మానిక్‌బండార్‌కు చెందిన వీరేశం (55) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. వీరేశం సీస కమ్మరి వృత్తి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. పేదరికం కావడంతో దహన సంస్కారాలకు డబ్బులు లేక మృతుడి భార్య తల్లడిల్లింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చందాలు వేసి అంత్యక్రియలు నిర్వహించారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	భజే వాయు వేగం (తెలుగు) – 10.40, గం గం గణేశా (తెలుగు) – 4.30, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) – 1.30, 7.20, 10.30
స్క్రీన్-2	గం గం గణేశా (తెలుగు) – 10.45, 1.45, 7.45, భజే వాయు వేగం (తెలుగు) – 4.45, 10.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	గం గం గణేశా (తెలుగు) – 10.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-2	భజే వాయు వేగం (తెలుగు)– 1.35, 7.35, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు) – 4.30, 10.30
స్క్రీన్-3	భజే వాయువేగం (తెలుగు) – 11.10, 10.40, నవి (హిందీ) – 2.05, 7.55 చోటాభీమ్ (హిందీ) – 4.50
స్క్రీన్-4	ఫ్యూరియస్ (తెలుగు) – 1.30 లక్ష్మీ (తెలుగు) – 4.45, 10.30 హిట్‌లిస్ట్ (తెలుగు) – 7.40
దేవి	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు)
నటరాజ్	హిట్‌లిస్ట్ (తెలుగు)
విజయ్	లక్ష్మీ (తెలుగు)